క్లుప్తంగా

ఘన జీవామృతంతో మంచి దిగుబడులు

చింతపల్లి: ఘన జీవామృతం వాడకం ద్వారా పంటల్లో మంచి దిగుబడుగులు సాధించ వచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనివా సరావు అన్నారు. మండలంలోని గడవరాయి గ్రామంలో ప్రకృతి విభాగం సిబ్బంది సహకా రంతో రైతులకు ఘన జీవామృతం తయారీపై ఆయన గురువారం శిక్షణ ఇచ్చారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన జీవామృ తం తయారు చేసుకున్న 6 నెలలు నిల్వ చేసుకుని వరి, మొక్కజొన్న, వేరుశనగ పంట లకు ఎకరానికి 200 కిలోల వినియోగించుకోవ చ్చన్నారు. మొక్కకు కావలిసిన పోషకాలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వినియోగం, ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం


సింగిరెడ్డి బాబ్జీ (ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగిరెడ్డి బాబ్జీ (70) అనారోగ్యంతో ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణకు సోదరుడు, మరో నాయకుడు రవికి తండ్రి. బాబ్జీ మృతికి స్థానిక నాయకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఖరీఫ్ సాగుపై సూచనలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసబాబు అన్నారు.మండలంలో గల సుజనకోట, జర్రెల, బాబుశాల, జోలాపుట్టు పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఖరీఫ్ సాగు, పొడి దుక్కులు, విత్తన గుళికల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. సాగుపై పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం రైతులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ భాగ్యవతి, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి


మృతి చెందిన యాచకుడు

చింతపల్లి: చింతపల్లి ముత్యాలమ్మతల్లి ఆలయ సమీపంలో గుర్తు తెలియని యాచకుడు(సాధువు) మృతి చెందినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. గత కొంతకాలంగా చింతపల్లిలో తోటి యాచకులతో కలసి యాచిస్తున్నాడని తెలిపారు. ఈయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని గురువారం ఉదయం నిద్రలోనే మృతి చెందినట్టు యాచకులు తెలియజేసినట్టు తెలిపారు. ఆయన పేరు సాయిశరణుగా చెబుతున్నారు.. తప్పితే మిగిలిన వివరాలు లేవని పేర్కొన్నారు. మృత దేహాన్ని రెండురోజులు పాటు తమ బంధువుల ఆచూకీ కోసం మార్చురీలో భద్రపరుస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో, పంచాయతీ అధికారుల సమక్షంలో శవం ఖననం పనులు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

రంపచోడవరం: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఫెయిలైన విద్యార్థులకు తిరిగి పాఠశాలలు తెరిచి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పీడీఎస్‌యూ నాయకుడు ఐ.రమణ డిమాండ్ చేశారు.ఏజెన్సీలో అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజు చెల్లించలేని పరిస్థితులో ఉన్నారని, ఐటీడీఏ పరీక్ష ఫీజు చెల్లించి ఆదుకోవాలని కోరారు. అలాగే ఎంసెట్, పాలిసెట్, వివిధ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన అల్లూరి జిల్లాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పది ఫలితాల్లో జిల్లా వెనుకబడడానికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

సాగునీటి కాలువ పనులు ప్రారంభం


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరిషదేవి

రాజవొమ్మంగి: మండలంలోని పలుగ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి గురువారం పర్యటించారు. జడ్డంగిలో సాగునీటి కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు శాశ్వత గృహ నిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు.

జీవనం.. దయనీయం

మట్టి వస్తువులకు తగ్గిన డిమాండ్ | కష్టపడినా దక్కని ఫలితం | ఆర్థిక ఇబ్బందుల్లో కొండ కుమ్మర్లు


ముంచంగిపుట్టు సంతకు కుండలు తీసుకు వస్తున్న గిరిజనుడు


వారపు సంతలో కొనుగోలుదారుల కోసం వేచి చూస్తున్న కొండ కుమ్మర్లు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో మట్టి కుండలకు, ప్రమిదలు, మట్టితో తయారు చేసే వస్తువులకు డిమాండ్ తగ్గింది.ప్రస్తుతం సమాజంలో ప్లాస్టిక్ వాడకం అధికమవడంతో మట్టితో వస్తువులపై ఆ ప్రభావం పడింది.దీంతో వారపు సంతల్లో మట్టి వస్తువులు అమ్మకాలు సక్రమంగా జరగడం లేదు. కార్తీకమాసం, సంక్రాంతి, వేసవి కాలంలో మట్టి వస్తువులకు మంచి డిమాండ్ ఉంటుంది. మండలంలో గల సుజనకోట, దార్రెల, వనుగుమ్మ, మాకవరం పంచాయతీల్లో 187 కొండ కుమ్మర్లు కుటుంబాలు ఉన్నాయి. వీరంతా మట్టి వస్తువులను తయారు చేయడంలో పేరొందారు. మట్టితో కుండలు, ప్రమిదలతో పాటు గృహాలంకరణ వస్తువులైన ఏనుగులు, శంకాలు వంటి అనేక రూపాల్లో వస్తువులను తయారు చేస్తారు. గిరిజన గ్రామాల్లో గిరిజన సంప్రదాయాలు ఉట్టి పడేలా మట్టి వస్తువులతోనే పూజలు ఆచరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా వారపు సంతల్లో కుమ్మర్లు తీసుకువచ్చే మట్టి వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం వారపు సంతల్లో మట్టి వస్తువులకు గిరాకీ తగ్గింది. గత కొన్ని నెలలుగా వ్యాపారం కుదేలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఆర్థికంగా పరమైన అవస్థలు పడుతున్నామని కొండ కుమ్మర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, భూసిపుట్టు, లక్ష్మీపురం, బంగారుమెట్ట పంచాయతీ కేంద్రాల్లో జరిగే వారపు సంతలకు కొండ కుమ్మర్లు 10 నుంచి 15 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి కుండలు, మట్టి పాత్రలను తీసుకువెళ్లి అమ్మకాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రవాణా చార్జీలు కూడా భరించలేని పరిస్థితుల్లో కొండ కుమ్మర్లు ఉన్నారు. ఈ కారణంగానే పక్క మండలాల్లోని సుదూరంలో ఉన్న సంతలకు సైతం కాలినడకన వెళ్లే పరిస్థితి నెలకొంది. పనులకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని వాపోతున్నారు.

కుండలు కొనేవారేరీ

కొండకుమ్మర్లు తయారు చేసే కుండలను కొనేవారు కరువయ్యారు. ఎన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ సాధారణంగా జీవించే వారి ఇళ్లల్లో సైతం ఫ్రిడ్జిలు కనిపిస్తున్నాయి. దీంతో కులవృత్తులకు పని లేకుండా పోతుంది. ముఖ్యంగా వేసవిలో కుండలు వినియోగించేవారే తక్కువవుతున్నారు. కుండలో నీటిని నిల్వ చేయడం వలన ఆ గుణాలన్నీ ఆ నీటిలో చేరుతాయి. ఆ నీటిని తాగడం వల్ల వేసవిలో మనం కోల్పోయిన శక్తి తిరిగి పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. మట్టి కుండలో నీరు తాగితే శరీరం డీహైడ్రేట్ కాకుడా జాగ్రత్త పడ వచ్చని సూచిస్తున్నారు. అయినా కుండలకు అంతంత మాత్రంగా మార్కెట్ ఉన్నట్టు కొండ కుమ్మర్లు ఒక్కో కుండ ధర దాని సైజ్‌ను బట్టి విక్రమం ఉంటుంది.ప్రస్తుతం ఒక్కో కుండ రూ.100 నుంచి సైజును బట్టి రూ.150 వరకు ధరకు అమ్ముతున్నారు.ఆరోగ్యానికి మేలు చేసే కుండ నీటిని తాగితే మంచిదని చాలా మంది చేబుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు

మట్టి పాత్రలు, కుండల అమ్మకాలు ప్రస్తుతం బాగోలేవు. గత కొన్ని నెలలుగా సరైన వ్యాపారం లేక కుండల తయారీని నిలుపుదల చేశాం. ప్రస్తుతం వేసవి కాలం రావడంతో మరలా కుండల తయారీ చేయడం మొదలు పెట్టాం. మట్టి వస్తువుల వ్యాపారం సక్రమంగా జరగడం లేదు. మండలంలో అన్ని వారపు సంతలకు వెళ్లి కుండలు, మట్టిపాత్రల అమ్మకాలను చేస్తున్నాం.వ్యాపారం బాగోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం.

– గోల్లోరి సుత్ర, కుండల వ్యాపారి, కుమ్మరిపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం


సంతలో మట్టి పాత్రలు, గృహాలంకరణ వస్తువుల విక్రయాలు

వ్యాపారం తగ్గింది

గతంలో వేసవి కాలంలో కుండల వ్యాపారం బాగుండేది. కుండ నీరు తాగింతే చాలా ఆరోగ్యకరమైనది. కుండలు చుట్టూ గోనే, కాటన్ వంటి వస్త్రం ఏదైనా చుట్టి దాన్ని చల్లబరుస్తూ ఉంచి కుండలో నీరే తాగేవారు. ప్రస్తుతం ఫ్రిడ్జ్‌లో నీరు తాగడం చేస్తున్నారు. ఫ్రిడ్జ్ నీరు తాగడం వల్లన అనారోగ్యం కలుగుతుంది. మట్టి కుండలో నీరు తాగడం వల్లన అనేక ప్రయోజనాలు కలుగుతుంది. మట్టి కుండలకు గిరాకీ లేక వ్యాపారం తగ్గిపోతూ వస్తుంది.

గిరిజనుడు, కుమ్మరిపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


నేరేడువలసలో బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న స్వామిజీ

జి.మాడుగుల: మండలంలోని నేరేడువలస గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు విశాఖపట్నం భీమిలి శ్రీ సద్గురు సేవాశ్రమం, గాంధీనగరం పంచముఖ ఆంజనేయ స్వామి సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ ముందుకొచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్యను స్థానికులు సాయిరాం స్వామిజీ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. ఈ మేరకు ఆయన తన సొంత నిధులతో గురువారం బోరు రిగ్గు వాహనాన్ని గ్రామంలో రప్పించి పనులు ప్రారంభించారు. తాగునీటిని అందించి సమస్యను పరిష్కరించారు. స్వామిజీకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా పలు ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటుచేసినట్టు స్వామిజీ చెప్పారు. సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యుడు మత్స్యరాస మత్స్యరాజు, గ్రామ పెద్ద రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం: వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ దొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈ గాబ్రియేల్ ఆదేశాల మేరకు ఫీడర్ పరిధిలోని 33 కేవీ పరిధిలో జంగిల్ కటింగ్ కారణంగా సరఫరా నిలిపివేస్తునట్టు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ దొర కోరారు.

మూగజీవాల మృత్యువాత.. రైతుల కలత


కడుతులలో మృతి చెందిన ఆవు

ముంచంగిపుట్టు: మండలంలో గల పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. గత వారం రోజుల వ్యవధిలో 12 మూగజీవాలు మృతి చెందాయి. మూగజీవాలు మృతిపై పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలిపినా కనిస స్పందన లేదని బాధితులు వాపోతున్నారు. కడుతుల గ్రామంలో సీసా రాజాబంధుకు చెందిన-3, కిరసాని రాజేష్‌కు చెందిన-ఒకటి, కిరసాని విగ్నేష్‌కు చెందిన-2, సాధురాంకు చెందిన-2, రాజు, కృష్ణమూర్తి, బుద్దు, సొన్నులకు చెందిన ఒక్కొక్కటి చొప్పున పశువులు మృతి చెందాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఆవులు, గేదెలు అనారోగ్యంతో ఉన్నాయని, చికిత్స అందించాలని పలుమార్లు పశువైద్య సిబ్బందికి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. దీంతో పశువులు మృతి చెందాయన్నారు. మూగజీవాలకు గొంతు వాపు, కడుపు ఉబ్బరంతో నోటి నుంచి నురుగతో హఠాత్తుగా మృతి చెందుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వ్యాధులతో ఉన్న మూగజీవాలకు తక్షణమే వైద్య సేవలు అందించాలని పనసపుట్టు మాజీ సర్పంచ్ మూల్యా, గిరిజన రైతులు కోరుతున్నారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు త్రినాథ్

ముంచంగిపుట్టు:రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీలను మోసం చేశారని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రా త్రినాథ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం గిరిజన సంఘం నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించడం దారుమన్నారు.అల్లూరి జిల్లాలో ప్రకటించిన డీఎస్సీలో 400 పోస్టుల్లో ఎస్టీలకు కేవలం 24 పోస్టులే ఉండడంతో ఆదివాసీలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఎంతోమంది గిరిజన నిరుద్యోగ యువతకు డీఎస్సీలో మోసం జరిగిందని, ఆదివాసీలపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే ఈ నెల 30వ తేది లోగా స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని, లేని పక్షనా గిరిజన యువతతో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు శ్రీను, శంకర్‌రావు, నారాయణ, జీనబంధు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌సిగ్నల్స్ లేక ఇక్కట్లు


సెల్‌టవర్ వద్ద ఆందోళన చేస్తున్న గొల్లపల్లి గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని అమ్మవారి దారకొండ గొల్లపల్లి గ్రామంలో వారంరోజులుగా సెల్ సంకేతాలు లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గృహనిర్మాణ లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా మ్యాపింగ్ ప్రక్రియకు విఘాతం కలుగుతోంది. దీనివల్ల తాము పథకాలకు దూరమవుతామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఫైబర్‌నెట్ వంటి సదుపాయాలనైనా తమకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. సమస్య పరిష్కరించాలని స్థానిక సిగ్నల్ టవర్ వద్ద గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు.

రహదారి పనులకు భూమిపూజ


బోసుబెడలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ జ్యోతి తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని బోసుబెడలోని సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మండియకేడి జ్యోతి గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారుల అభివృద్ధితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో శివారు గ్రామాల్లోనూ విస్తృతంగా అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామంలో డ్రైనేజీ, విద్యుత్ దీపాలు తదితర సమస్యలను స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె మాట్లాడుతూ దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు నాయకులు కృష్ణారావు, బాలరాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి భోగిరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రదీప్ చంద్ర, గ్రామస్తులు రామచందర్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఆరాధన

అనకాపల్లి టౌన్: పట్టణంలోని భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా బాబా సమాధి వద్ద జ్యోతి ప్రజ్వలన, పూజా కార్యక్రమం నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థులతో ఓంకారం, గణేష్ ప్రార్థన, సాయి గ్రాయిత్రి పారాయణం చేశారు మహేశ్వరావు, మాధవరావు, సుబ్రహ్మణ్యస్వామి, సత్యసాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు


వాహనచోదకులకు సూచనలిస్తున్న ఎస్ఐ వినోద్

అడ్డతీగల: మండల కేంద్రంలో గురువారం ఎస్ఐ వినోద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను నిర్వహించారు. స్థానిక దేవీసెంటర్‌లో ప్రతి వాహనాన్ని ఆపి రికార్డులు తనిఖీ చేశారు. సక్రమంగా రికార్డులు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు. వాహన తనిఖీల్లో పలువురు మైనర్ల వాహనాలు నడుపుతూ పట్టుబడడంతో వారికి ఎస్ఐ వినోద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వినోద్ హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


గెదలబందలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలలోని తూటంగి సచివాలం పరిధిలోని గెదలబంద గ్రామంలో సుమారుగా 70 గృహలకు గురువారం మొదటి విడత ఏసీఎం స్ప్రేయింగ్ పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా దుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర పి.రాంబాబు ఆదేశాలతో హెచ్ఎస్ రామారావు పర్యవేక్షణలో దోమల మందు పిచికారీ చేయించారు.
ప్రస్తుతం ఏపీడీమిక్ సీజన్ సమీపిస్తుండడంతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రం ఉంచుకొని, దోమల వ్యాప్తి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలతో లాభాలు


మట్టి నమూనాలను పరిశీలిస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: రైతులు విధిగా మట్టి నమూనా పరీక్షలను చేయించుకోవాలని ఏవో ఉమాదేవి సూచించారు. మట్టి నమూనాలతో భూమిలో ఎలాంటి పోషకాల లోపం ఉన్నా తెలుస్తుందన్నారు. ఆమె గురువారం కొమ్మిక రైతు సేవా కేంద్రం పరిధిలో సిబ్బందితో కలిసి మట్టి నమూనాలను సేకరించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రతీ రైతు విధిగా నమూనాలను పరీక్షించుకోవాలని సూచించారు. దీంతో పంటలు ఏమిటి వేసుకోవాలో తెలుస్తుందన్నారు.అదే విధంగా ఎలాంటి పోషకాల లేమి ఉన్నా తెలుస్తుందని చెప్పారు.పంట పొలాల్లో సూక్ష్మ పోషకాలు అత్యంత కీలకమని సూచించారు. వాటిని ఎలా పెంచాలో వివరించారు. ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాల అవసరాన్ని ప్రణాళిక పరంగా ఇండెంట్ తయారు చేస్తున్నామన్నారు. వీహెచ్ఏ పెంటన్న పాల్గొన్నారు.

రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలు


మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ తరుణ్

రాజవొమ్మంగి: మండలంలోని జాతీయ రహదారిపై తరచు జరుగుతున్న ప్రమాదాలకు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులే కారణమని వెటర్నరీ డాక్టర్ తరుణ్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని గురువారం సిబ్బందిని ఆదేశించారు. చీకట్లో రోడ్లపై తిరుగుతున్న గేదెలు కనిపించక వాహనచోదకులు వీటిని ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ ప్రమాదాలు నివారించాలంటే పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటించాలని, ఈ మేరకు రైతులను అవగాహన కల్పించాల్సిన అవసరముందని సిబ్బందికి సూచించారు.

పోలీసుల చొరవతో గొయ్యి పూడ్చివేత


పనులను పర్యవేక్షిస్తున్న సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: మండల కేంద్రానికి సమీపంలో సీలేరు వెళ్లే ప్రధాన మార్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గొయ్యి ఏర్పడింది. రహదారి అంచు పూర్తిగా దెబ్బతిని అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరినా అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదాన్ని గుర్తించిన సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పల సూరిలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గుంతను జేసీబీ, స్థానిక యువకుల సాయంతో పూడ్చివేత పనులు చేపట్టారు.

రహదారిపై కూలిన చెట్ల తొలగింపు


గూడ గ్రామ సమీపంలో రోడ్డుపై అడ్డంగా పడిన వెదురు చెట్లను తొలగిస్తున్న మాజీ మంత్రి బాలరాజు

హుకుంపేట: మండలంలోని బుధవారం కురిసిన భారీ వర్షానికి గూడ గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగ పడిన వెదురు చెట్లను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు గ్రామస్తుల సహాయంతో చెట్లను నరికి తొలగించారు. గురువారం హుకుంపేట నుంచి పెదబయలు వైపు వెల్లె క్రమంలో రహదారికి అడ్డంగా పడిన వెదురు చెట్లను చూసి స్థానికులను పిలిచి స్వయంగా గిరిజనులతో కలిసి వెదురు చెట్లు నరికి తొలగించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు మాజీ మంత్రిని అభినందించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న సర్పంచ్ సంతోష్ కుమార్

వి.ఆర్.పురం. మండలంలోని చోక్కనపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తోడం రాంబాబు ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు, బియ్యం, వంట పాత్రలు, నగదును సర్పంచ్ పులి సంతోష్, యూటీఎఫ్ నాయకుడు సున్నం రాజులు గురువారం అందజేశారు. ఈ సాయం యూటీఎఫ్ నేతల సహకారంతో జరిగింది. నాయకులు జగదీష్, రామకృష్ణ, బాబు, రామారావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కొఠంకోట: వారపు సంతలో గురువారం కూరగాయలు సాధారణ ధరకు అమ్మకాలు సాగాయి. కిలో టమాటా రూ.20, ఉల్లి, బెండకాయ, వంకాయ, దొండకాయ, బంగాళదుంప రూ.30, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.